# కలలసౌధం

వై. వసంత

కథ

ఫోన్ రింగవుతోంది. బ్యాగ్‌లోంచి సెల్ తీసి -

"ఎవరు కాలింగ్" అనుకుంటూ చేతిలోకి తీసుకున్నాను.

"మణి అక్క కాలింగ్"

రిసీవింగ్ బటన్ నొక్కి 'హలో' అన్నాను.

"హలో! పిన్నీ! మా ఇంటికి ఎప్పుడు వస్తావు? రుషి అన్న ఏం చేస్తున్నాడు? తొందరగా రండి! మేం ఆడుకుంటాం!" అక్క కొడుకు శరవణ్ ప్రశ్న.

"యహ ఉండరా! ఎప్పుడూ ఆటలే నీకు. నాకియ్యి ఫోను" మైథిలి గొంతు.

రిసీవర్ లాక్కున్న శబ్దం.

"హలో పిన్నీ నువ్వు, పెద్ద పెద్దమ్మ లేరు ఇక్కడ. అందరూ వచ్చేశారు. తొందరగా రమ్మంటోంది అమ్మ. ఇదిగో అమ్మ మాట్లాడుతుందిట ఫోన్ ఇస్తున్నాను" అంటూ హడావుడిగా మాట్లాడి నా సమాధానం వినకుండానే వాళ్ళ అమ్మకు ఇచ్చింది.

ఎవరో తరుముకు వస్తున్నట్లుగా వుండే దాని మాటలకు, విన్న కొద్దీ వినాలనిపించే మాటల్లోని గోదావరి యాసకు నవ్వుకుంటూ-

"హలో" అన్నాను.

"హలో! మీరు మా గృహప్రవేశానికి వచ్చారా? లేక అక్కా వాళ్ళింటికి వచ్చారా?"

"మీ ఇంటికే అనుకో! కానీ ఇప్పుడే కదా తణుకు నుంచి వచ్చి భోజనం చేశాం. నేనే ఫోన్ చేద్దామనుకుంటున్నాను. ఈ లోపు నీ కొడుకు చేశాడు"


"నన్ను చంపేస్తున్నాడు రుషి అన్న, పిన్ని ఎప్పుడు వస్తారని. ఎన్ని ఫోన్లు చేసేస్తున్నాడో. ఈనెల మా ఫోన్ బిల్లు పేలిపోతుంది"

"నువ్వు పెట్టెయ్. నేను చేస్తాను"

"ఫర్వాలేదులే. అసలు చెబుతున్నానంతే! అమ్మ బ్యాంక్ పని అయిపోయిందట కదా?"

"అయ్యింది. ఏం చేస్తున్నారేమిటి?"

"అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. నువ్వు, అక్క, అమ్మ తొందరగా రండి"



"అలాగే పెద్ద అక్క టీ పెడుతోంది. వాళ్ళు టీ తాగాక బయ ల్దేరి వస్తాం"

"మధ్యాహ్నం భోజనాలు చేసి మణీ వాళ్ళింటికి వెళదాం. మా ఇంటికే రండి" హైదరాబాద్‌కి ఫోన్ చేసి చెప్పింది పెద్దక్క

ఈరోజు ఉదయమే స్టేషన్ నుంచి నేరుగా వాళ్ళింటికే వెళ్ళాం.

అక్కడే స్నానాలు, టిఫిన్లు పూర్తి చేసుకొని అమ్మ పెన్షన్ పని మీద అమ్మ, నేను, నా చిన్నకొడుకు, అన్నయ్య కొడుకు టాక్సీలో తణుకు వెళ్ళాం. తిరిగి వచ్చేసరికి మూడు గంటలయింది.

** ** **

సాయంత్రం ఆరుగంటల వేళ-

అక్కలందరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"నువ్వు, పెద్ద అక్క మా కొత్తింటికి వెళ్ళి గుమ్మాలకు పసుపు రాసి, ఇంట్లోనూ, బయట ముగ్గులు పెట్టి, గుమ్మాలకి మామిడి తోరణాలు కట్టి రండి" అంది.

అక్కడకు తీసుకెళ్ళవలసిన బకెట్లు, మగ్గు, ఇంటి అలంకరణకు మామిడితోరణాలు, పూల మాలలు, ముగ్గు డబ్బా పెట్టిన రెండు పెద్ద సంచీలు చేతికిచ్చింది.

"ఇప్పుడే కదా! వాళ్ళిద్దరూ వచ్చారు. అప్పుడే వెళ్ళమంటు న్నావా? పాపం పిన్ని" అంది మైథిలి. దాని మాటల్లో నేనంటే ఇష్టం, ప్రేమ కనిపించాయి. నాకు కూడా దాన్ని చూడగానే మనసంతా అలౌకికఆనందానికి లోనవుతుంది.

"ఏయ్ ముదురూ! నువ్వు మాట్లాడకు అని, రాత్రి వంట ఎవరు చేస్తారు? నీకు వంటలో సాయం చేస్తాను" అన్నాను మణక్కతో.

"నేనే చేస్తాను. ఈ పూటకే! రేపు ఎలాగూ కేటరింగే!"

"భారీ ప్రయత్నాలు చేయకు. లైట్‌గా చెయ్యి" అన్నాను.

"అన్నం, కూర చేస్తే చాలు. మధ్యాహ్నం సాంబారు చేసి, కొబ్బరి- మామిడికాయ పచ్చడి చేశాను. గోంగూర పచ్చడి, టమాట పచ్చడి, కందిపొడి వున్నాయి. మీరు వెళ్ళి అక్కడ పనులు చూడండి. పాపం పొద్దున్న రైలు దిగినప్పటి నుంచి తిరుగుతూనే ఉన్నావు. అయినా చెప్పక తప్ప లేదు" అంది.

"ఫర్వాలేదులే! నువ్వు మా ఇంటికి వచ్చినప్పుడు చేసేదాన్లో నేను చేసేది ఎంత?"

"పిన్నీ! నేను కూడా వస్తాను. గుమ్మాలకి పసుపు రాస్తానే!" అంది మైథిలి.

దాన్ని చూస్తుంటే మా చిన్నతనం గుర్తుకు వస్తుంది. రెండు జడలు, పట్టు లంగా, జాకెట్, రెండు చేతులకు గాజులు, మెడలో గొలుసు. అచ్చం మేం చిన్నప్పుడు ఎలా వుండేవాళ్ళమో అలాగే వుంది. దానికి

నాకు ఇద్దరూ మగపిల్లలే కావడంతో దాని మాటలు, చేతలు అన్నీ ముద్దుగానే అనిపిస్తాయి.

"రా తింగరబుచ్చీ" అన్నాను. దానికి నేను పెట్టిన ముద్దు పేరది.

నేను, పెద్దక్క, మైథిలి పేపరు మిల్లు క్వార్టర్స్ గేటు దగ్గరకు వచ్చి కొత్త ఇంటికి వెళ్ళడానికి ఆటో ఎక్కాం.

** ** **

"ఇదే మా ఇల్లు. బాగుందా?" అంటూ నా మొహం కేసి చూసింది మైథిలి ఆటో దిగుతూనే.

దాని మొహంలో నేను ఏమంటానో అన్న ఉత్సుకత.


"బావుంది" అన్నాను పొడిగా.

"చిన్నగా వుంది కదా" అంది.

"చిన్నగా వుండటం ఏమిటి? చక్కగా వుంది" అంది పెద్దక్క.

వంద గజాల స్థలంలో కట్టిన ఇల్లు అది.

ఎందుకో 'ఇల్లు' అనే మాట వినగానే రేలంగిలో నేను పుట్టిపెరిగిన ఇల్లే గుర్తుకొస్తుంది.



విశాలంగా వుండే ఇంటి ఆవరణ, రకరకాల చెట్లు, పూల మొక్కలు ఉండి పచ్చగా కళకళలాడే ఇంటి స్వరూపమే కళ్ళముందు కదలాడుతుంది.

సిటీలో ఫ్యామిలీ పోర్షన్‌లు, అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్స్‌లో ఉండటమంటే మొండి గోడల మధ్యన జీవించటం కదా అన్పించేది. ఒక చెట్టుకీ, పూల మొక్కకీ, పక్షి అరుపుకీ చోటు లేని, కిందామీదా మనదికాని ఫ్లాట్స్‌లో నివసించడం కన్నా ఇలాంటి చిన్న ఇల్లయినా మంచిదేమో! అలా అనుకున్నాకానీ మళ్ళీ రేలంగిలోని ఇల్లే తలపుకొస్తుంది.

"ఏంటే పరధ్యానం... లోపలకి పద" అంటూ పెద్దక్క దారితీస్తే, ఏం లేదంటూ లోపలికి అడుగు పెట్టాను.

తెల్లవారుజామున మూడు గంటలకు గృహప్రవేశం.

ఇంకా పనివాళ్ళు ఇంట్లో పని చేస్తూనే వున్నారు.

"ఇల్లంతా పూర్తి కాకపోయినా కనీసం గృహప్రవేశం అయ్యాక వాడుకునేందుకు వీలుగా బాత్‌రూమ్స్ అయినా పూర్తి చేయమంటే ఇప్పుడే బాత్‌రూమ్ గోడలకి ప్లాస్టరింగ్ చేసారు. ట్యాప్ బిగించారు" అన్నాడు అక్కడే పనులు చేయిస్తున్న మణక్క బావ.

ఇంట్లో లైట్లు, స్టాండ్ ఫాన్లు అమర్చారు. పనివాళ్ళు వెళ్ళేసరికి ఏడయింది.

ఆ వెంటనే కొంగు దోపి నేను, అక్క చెరో చీపురు తీసుకున్నాం. క్లీనింగ్‌లో పడ్డాం.

పెద్దక్క బయట తుడిచింది. ఇంటికి ఇంకా ఫ్లోరింగ్ కాలేదు. అంతా మట్టిగా వుంది. నేను గదులు తుడిచి నీళ్ళు జల్లాను.

పెద్దక్క లోపల గదుల్లో ముగ్గుపెడుతుంటే బయట వాచ్‌మెన్ భార్యచేత పేడనీళ్ళు జల్లించాను.

ఇంట్లోను, ఇంటి చుట్టూ వున్న సందులోనూ అందంగా ముగ్గులు పెట్టింది పెద్దక్క.

వాటివైపు చూడగానే మా చావడిలో పెద్దపెద్దగా వేసే ముగ్గులే గుర్తుకొచ్చాయి మళ్ళీ.

కాస్సేపు ఆలోచనల్ని పక్కకు పెట్టాలనుకున్నా.

నేను, బావ గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి, పూల మాలలు కట్టాం.

మైథిలితో కబుర్లు చెబుతూ గుమ్మాలన్నింటికీ పసుపు రాసి కుంకుమ, బియ్యపు పిండితో బొట్లు పెట్టాం.

"తొందరగా కానివ్వండి. వెళదాం. భోజనాల టైము అవుతోంది" అంటూ పెద్దక్క కంగారు పెట్టేసింది.

సిటీలో ఫ్యామిలీ పోర్షన్‌లు, అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్స్‌లో ఉండటమంటే మొండి గోడల మధ్యన జీవించటం కదా అన్పించేది. ఒక చెట్టుకీ, పూల మొక్కకీ, పక్షి అరుపుకీ చోటు లేని, కిందామీదా మనదికాని ఫ్లాట్స్‌లో నివసించడం కన్నా ఇలాంటి చిన్న ఇల్లయినా మంచిదేమో!

** ** **

అందరి భోజనాలు అయ్యేసరికి పదకొండు అయింది.

"ఒక గంట నడుం వాల్చి గృహప్రవేశానికి తయారవుదాం" అంది మణక్క.

బావ వైపు చుట్టాలందరూ బెడ్‌రూమ్స్‌లో పడుకున్నారు. అమ్మ, ఆమె సంతానం ఏడుగురం- అయిదుగురు అక్కలు, అన్నయ్య, నేను హాల్లో కూర్చున్నాం.

అక్కలందరూ వాళ్ళ పిల్లల చదువులు, ఉద్యోగాలు ఇలా ఏదో ఒకటి మాట్లాడుతూనే వున్నారు.

"మణీ, మీ ఇల్లు బాగుంది" అంది పెద్దక్క.

"అంతలేదులే కానీ, ఏదో చిన్న ఇల్లు" అంది.

"అలా అనుకోకూడదు. చిన్నేమిటి, పెద్దేమిటి. సొంతిల్లంటూ కట్టుకున్నారు" అంది అమ్మ.

"అవును. హైదరాబాద్‌లో మా ఇల్లు మటుక్కు నూట ఇరవై గజాల్లోనే కదా కట్టాం" అన్నాను తను చిన్నబుచ్చుకోకుండా ఉండాలని.

"అవున్లే! ఈరోజుల్లో ఇండిపెండెంట్ హౌస్ ఉండటమే గొప్ప. కాంక్రీట్ జంగిల్స్ కన్నా వంద గజాల్లో ఇల్లు నయమే కదా!" అంది నాలుగో అక్క.

"సొంత ఇల్లు అనుకుంటారు గానీ, ఫ్లాట్స్‌లో ఉంటే ఎలాంటి బాదరబందీ ఉండదు" అన్నాడు చిన్నక్క కొడుకు రవి. ఎం.ఎస్.సి.లో పని చేస్తున్నాడు. ఉద్యోగంలోకి వచ్చి రెండేళ్ళు కాకముందే ఫ్లాట్ కొన్నాడు.

"అది హైదరాబాద్‌లో బావుంటుందేమో గానీ రాజమండ్రిలాంటి చోట ఇలా ఇల్లు కట్టుకోవడమే బావుంటుంది" అన్నాడు అన్నయ్య.

"ఎవరేమైనా చెప్పండి ఇల్లు అంటే రేలంగిలో ఉన్నట్లు ఉండాలి" అంది మూడో అక్క.

"అయినా మన ఊర్లో మనం పుట్టి పెరిగిన ఇంటి ముందు ఈ ఇళ్ళు ఎంత?" అన్నాను రేలంగిలోని మా ఇల్లు గుర్తుకొస్తుంటే.

"అవును. హాలు అదే, డైనింగ్‌రూమ్, స్టడీరూమ్, లివింగ్‌రూమ్ అన్నీ అదే.ఒకళ్ళు నుంచుంటే ఇంకొకళ్ళు పట్టని వంటగది. ఎంతమంది చుట్టాలు

వచ్చినా పొడుగు, పేకా కింద రెండుగదుల్లో పడకలు. అదే మన ఇంట్లో అయితే ఎనిమిది గదులుండేవి. చక్కగా చావిట్లోకానీ, బయట, దొడ్లో అరుగులమీద కానీ కూర్చుని చదువుకునే వాళ్ళం" అంది మణక్క.



ఆమె మాటల్ని అంగీకరిస్తున్నట్టు అందరూ మౌనంగా ఉండిపోయారు.

"నువ్వు ఈసారి మన ఊరు వెళతావా?" అంది మణక్క.

"పుష్కరాలకు వచ్చినప్పుడు వెళ్ళలేదు. కుదిరితే ఆదివారం పొద్దున్న వెళదామనుకుంటున్నాం. నువ్వూ వస్తావా?" అడిగాను.

దానికి, నాకే ఆ ఇల్లు అంటే ఎక్కువ మమకారం. మేమిద్దరం ఆ ఇంట్లోనే పుట్టాం. మిగిలినవారు కొవ్వూరులో అమ్మమ్మ వాళ్ళింట్లో పుట్టారు.

ఆ ఊరు వదిలేసి వచ్చిన ఇరవై సంవత్సరాల్లోనూ ఒక్కరోజు కూడా ఆ ఇంటిని తలుచుకోకుండా ఉండలేదు. నాకు వచ్చే ప్రతి కలలోనూ ఆ ఇల్లే కనిపిస్తుంది.

"నేను రానుకానీ, మా పిల్లలు అడుగుతున్నారు. తీసుకెళ్ళు" అంది.

"సరే. మా చిన్నవాడు కూడా అడుగుతున్నాడు. వాడికి ఆరునెలలప్పుడు ఒకసారి వెళ్ళాను. మళ్ళీ ఇంతవరకు వెళ్ళలేదు. మొన్న వర్షాలప్పుడు మన ఇంటిని తలుచుకున్నాం. వర్షాకాలంలో మన నూతిలో నీళ్ళు పైకి వచ్చేవని, బకెట్‌తో ముంచుకునే వాళ్ళమని చెప్పాను. అయితే రాజమండ్రి వెళతాంకదా! నన్ను మీ ఊరుకి తీసుకెళ్ళు" అన్నాడు.

"అక్కడ ఎవరు వున్నారు? పాతబడిన ఇల్లు తప్ప. డెబ్బై సంవత్సరాల క్రితం కట్టిన ఇల్లు. అమ్మా, నాన్నల పెళ్ళి అయ్యాక కొత్తజంట గృహప్రవేశం అయిన ఇల్లు. అప్పుడు అమ్మకు పది సంవత్సరాలు. అమ్మ, నాన్న అన్నయ్య దగ్గరకు హైదరాబాద్ వెళ్ళిపోవడంతో ఇప్పుడు ఆ ఇంటి వైభవమే పోయింది. కొంతకాలం బాబయ్య, పిన్ని ఉండేవారు. ఆ తర్వాత అద్దెకు ఇచ్చారు. సంరక్షణ లేకపోవడంతో ఇంటి కళాకాంతులు తగ్గాయి."

"అయినా ఫర్వాలేదు. మేం చూస్తాం" అన్నారు పిల్లలు.

వాళ్ళ ఉత్సాహం నాకు ఆనందాన్ని ఇచ్చింది.

నాన్నకు పక్షవాతం వచ్చాక, నా చదువు పూర్తి అయ్యాక అమ్మని, నాన్నని, నన్ను అన్నయ్య హైదరాబాద్ తీసుకెళ్లాడు. నాకు అక్కడే ఉద్యోగం చూశాడు. అన్నయ్యతో ఉన్నప్పుడుగానీ, పెళ్ళి తర్వాతగానీ ఇళ్ళు మారుతూ ఎక్కడో ఒకచోట ఉండేవాళ్ళం.

'ఫ్యామిలీ పోర్షన్' అనే ముద్దు పేరుతో ముచ్చటగా మూడు గదుల్లో సర్దుకుపోవడం ఎంత కష్టమో తెలిసింది. హాలు, మధ్యలో పడకగది, వెనక వంటగది. కంబైన్డ్ బాత్‌రూమ్-లెట్రిన్... పెళ్ళయ్యాక కూడా మరో ఫ్యామిలీ పోర్షన్‌లోకి. ఎక్కడయినా అంతే.

ఫ్లాట్స్‌లో ఉన్నా అదే పరిస్థితి. పగలయినా లైటు వేసుకుంటే గానీ వెలుతురు ఉండదు. పలకరించే దిక్కు ఉండదు. మొక్క నాటుకునే వీలుండదు. మనసుకు నచ్చిన ముగ్గు వేసుకోవడానికి చోటు ఉండదు.

కాందిశీకుల్లా ఒకచోట తలదాచుకోవడమే తప్ప 'ఇంట్లో' ఉంటున్నామనే ఫీలింగ్ ఎక్కడ?

అయిదేళ్ళకిందట స్థలంకొని కట్టుకున్నాక సొంతింట్లోకి మారినా 'ఇల్లు' అనే మాట ఎత్తితే విశాలమైన చిన్నప్పటి ఇంటి స్వరూపమే గుర్తుకొస్తుంది. కంప్యూటర్‌లో కమాండ్ 'డి' కొట్టి ఇంకో ఫైల్‌ని క్రియేట్ చేసినట్టు రేలంగిలోని ఇంటిని హైదరాబాద్‌లో ప్రతిష్టించలేను.

బహుశానాకు అదొక అబ్సెషన్‌లా తయారయిందేమో! ఈరోజు పదేపదే రేలంగిలోని ఇల్లే గుర్తుకురావడం అంచేతనేనా!

** ** **

రాజమండ్రి-భీమవరం రైలు ఎక్కి మా ఊర్లో దిగాం.

'ఫ్యామిలీ పోర్షన్' అనే ముద్దు పేరుతో ముచ్చటగా మూడు గదుల్లో సర్దుకుపోవడం ఎంత కష్టమో తెలిసింది. హాలు, మధ్యలో పడకగది, వెనక వంటగది. కంబైన్డ్ బాత్‌రూమ్-లెట్రిన్... పెళ్ళయ్యాక కూడా మరో ఫ్యామిలీ పోర్షన్‌లోకి. ఎక్కడయినా అంతే.

మా ఇంటికి రిక్షాలో వెళదామా? లేక నడిచి వెళదామా? అన్నాను.

మైథిలి, రుషి 'నడుద్దాం' అన్నారు. అమ్మని, శరవణ్‌ని రిక్షా ఎక్కించాం.

ఊరికి చివరగా వుంటుంది రైల్వేస్టేషన్. అక్కడనుంచి ఊర్లోకి నడిచివెళ్ళాలంటే కాలువ గట్టు మీంచి దగ్గర దారి. నడవడం మొదలు పెట్టాం.

పచ్చటి పొలాలు, చేలగట్ల మీద వున్న కంది చెట్లు, వంకాయలు, బెండకాయలమొక్కలు చూసి పిల్లలు సంబరపడిపోయారు. చేలగట్ల మీద నడవడానికి అడ్డువస్తున్న పీతలు, తేళ్ళు చూసి కొంచెం భయంతో కూడిన సంబరం వారి ముఖాల్లో.

"అమ్మా! ఇక్కడేదో పెద్దకాయ వుంది" అన్నాడు రుషి.

'ఏదీ'అంటూ వాడు చూపించిన వైపు చూశాను. నా ముఖంలో ఆనందం. వెంటనే దాన్ని రెండు చేతులతోనూ పైకి తీశాను.

"ఏమిటది?" చిన్నాడి ప్రశ్న.

"దీన్ని తాటిపండు" అంటారు అన్నాను.

"ఏం చేస్తావు" అన్నాడు.

"హైదరాబాద్ తీసుకెళ్దాం. నువ్వు, అన్న, నాన్న తిందురుగాని".

"దీన్ని తింటావా?" అంటూ వికారంగా ముఖం పెట్టాడు.

"అవును. మా చిన్నప్పుడు ఈ కాలంలో ఆదివారం మధ్యాహ్నం టిఫిన్ తాటిపండే. దీంట్లో మూడు టెంకలు ఉంటాయి. ఒక టెంక పుచ్చుకుని తినడం మొదలుపెడితే రెండు గంటలు ఈజీగా పట్టేది" అని వాళ్ళకు చెబుతుంటే చిన్నప్పటి రోజులు గుర్తుకొచ్చాయి.

ఆదివారం పొద్దున్నే స్నానానికి నీళ్ళు కాగిన తర్వాత, పొయ్యిలో దీన్ని కాల్చేది మా అత్తయ్య. చిన్నతనంలోనే భర్త పోవడంతో మా ఇంట్లోనే వుండేది. బాగా చల్లారిన తర్వాత నేను, పెద్దమ్మలిద్దరు పోటీలు పడి తినేవాళ్ళం. ఒక్కొక్కసారి దీని గుజ్జుతో తాటిరొట్టె, తాటి అప్పాలు చేసేది అమ్మమ్మ. 'ఆ తిళ్ళు ఏమిటని తాతగారు తిట్టేవారు' చెప్పాను అప్పటి వాటి రుచిని, ఆ రోజుల్ని గుర్తుచేసుకుంటూ.

చేలు దాటి కాలువ గట్టుకు వచ్చాం. చాకిరేవులో నడుం వంగిపోయినా ఇంకా పనిచేస్తోంది మాచిన్నప్పుడు బట్టలు ఉతికిన చాకలి వీరమ్మ. చాకలి బాన దగ్గర బట్టలు ఉడికిస్తోంది.

"వీరమ్మా బాగున్నావా?" అని పలకరించాను.

కళ్ళకు చేతులు అడ్డంపెట్టుకొని మాకేసి చూస్తూ "చూపు మందగించింది, మీరెవరు?" అంది.

"నేను అగ్రహారంలో నారాయణశాస్త్రిగారి ఆఖరి అమ్మాయిని" అన్నాను.

"బేమ్మల అమ్మాయిగోరా? అమ్మగోరు బాగున్నారా?" అని అడిగింది. వణుకుతున్న కంఠంతో.

"బానేవుంది. ఊళ్ళోకి వెడుతున్నాం" అని ముందుకు నడిచాం.

"ఈ వీరమ్మకూడా మాకు తాటిపళ్ళు తెచ్చిపెట్టేది" అన్నాను మావాడితో.

"అదిగో అక్కడ గేదెలు కడుగుతున్నారే! దాన్ని 'దూడలరేవు' అనేవారు. వంతెనకు ఇటు పక్కన దూడల రేవు. అటుపక్కన పెద్దరేవు. అంటే అక్కడికే అమ్మమ్మ వాళ్ళు వచ్చి స్నానం చేసి బిందెలతో తాగడానికి మంచినీళ్ళు తీసుకు వచ్చేవారు."

"ఛీ! ఇంత దర్టీగా ఎర్ర రంగులో ఉన్నాయి. ఈ నీళ్ళు తాగేవారా? గేదెలకి ఇక్కడే స్నానం, బట్టలు ఉతకడం, మనుషులు స్నానం చేయడం, మళ్ళీ ఆ నీళ్ళే తాగటం" అన్నాడు.

"అవును. కాలువ ప్రవాహంలో అన్ని మలినాలు కొట్టుకుపోతాయి. మాకు అప్పట్లో కనీసం జలుబు కూడా చేసేది కాదు. కొత్తనీరు వచ్చే ఈ కాలంలో బిందెతో నీళ్ళు పట్టి, చీడీమీద 'ఇందుపుకాయ' అరగదీసి బిందెలో కలిపేవారు. ఇంటికి వచ్చేసరికి ఆ నీళ్ళు తేరిపోయేవి. ఇప్పటి ఫిల్టర్ వాటర్‌కి

ఏమాత్రం తీసిపోకుండా స్వచ్ఛంగా వుండేవి" అన్నాను.

నా కబుర్లు వింటూ ఉత్సాహంగా కాళ్ళ నొప్పు లు మర్చిపోయి నడిచారిద్దరూ.

అగ్రహారంలోకి వచ్చాం. ఊరు చాలా మారిపో యింది. ఇరవై సంవత్సరాలకి, ఇప్పటికి ఎంత మార్పు. దార్లో కనిపించిన వారి ఆప్యాయపు పల కరింపులను అందుకుంటూ మా ఇంటికి చేరాం.

గేటుకు ఎదురుగా రోడ్డుమీద నుంచొని "ఇదే మా ఇల్లు" అన్నాను.

అప్పటికే అమ్మ, శరవణ్ ఇంటి అరుగుమీద కూర్చుని వున్నారు. అద్దెకు వుండే పిన్నిగారు మంచి నీళ్ళు తెచ్చి ఇచ్చింది. అవి తాగి ఆవిడతో కబుర్లు చెబుతూ కూర్చుంది అమ్మ.

నేను, పిల్లలు కూర్చోకుండా చెప్పులు వదిలి ఇంట్లోకి నడిచాం.

దొడ్డితలుపు తీసుకొని బయటకు వెళ్ళాను. అక్కడున్న సిమెంట్ అరుగు పెచ్చులూడిపోయి వుంది. దొడ్డి అంతా పిచ్చిమొక్కలు.

మా చిన్నతనంలో దొడ్డి, మొక్కలు సంరక్షణ అంతా అత్తయ్య చూసుకునేది. ఆవిడకు మొక్కలు అంటే ఇష్టం.

తెల్లవారుజామునే నాలుగు గంటలకు లేచి నాన్న చెంబు తీసుకుని కాలువకు వెళ్ళేవారు. ఆయన లేచినప్పుడే అత్తయ్య కూడా లేచి వీధిలోనూ, దొడ్డిలోనూ తుడిచి, పేడనీళ్ళు జల్లి ముగ్గులు వేసేది.

భోజనాల గదిలోనే ఈశాన్యం మూల వున్న గూటిలో అత్తయ్య దేవుణ్ణి పెట్టేది. ఆగ్నేయంవైపు వున్న గూటిలో నాన్న దేవతార్చన పెట్టె, సుందరకాండ పుస్తకాలు పెట్టుకొనేవారు. రోజూ తెల్లవారుజామునే కాల కృత్యాలు తీర్చుకుని సంధ్యావందనం, సుందరకాండ సప్తసర్గ పారా యణ, దేవతార్చన చేసేవారు.

కాలువకు స్నానానికి వెళ్ళేముందు దొడ్డి అంతా తిరిగి పిచ్చిమొక్క లుంటే తీసేసి, ఆరోజు ఏంకూర చేయాలో నాన్నను అడిగి ఆవిడే కోసు కువచ్చేది. ఇంట్లో వంటపని అత్తయ్యే చూసేది. అత్తయ్య వండిన గుమ్మడికాయ కూరంటే ఇంట్లో అందరికీ చాలా ఇష్టం. అమ్మకు ఆడపిల్లల సంరక్షణ, పైపనులు, బట్టలు ఉతకడంలాంటి పనులతోనే సరి పోయేది.

దొడ్లో లేని కూర అంటూ ఉండేది కాదు. పెద్ద గుమ్మడి, బూడిద గుమ్మడి, బచ్చలి, సిలోన్ బచ్చలి, పొట్లకాయలు, కరివేపాకు, పచ్చి మిరపకాయ మొక్కలు, బెండకాయలు, వంకాయలు, చిక్కుడుకాయలు, నేతిబీరకాయలు, బీరకాయలు ఇలా అన్నిరకాల పాదులు, మొక్కలు వేసేది. రకరకాల పూల మొక్కలుండేవి. ఆయా కాలాల్లో కాసే తాజా కూరలు, పువ్వులతో కళకళలాడుతూ ఉండేది. ఆఖరికి అల్లం మొక్కల్ని, పసుపు మొక్కల్ని కూడా వేసేది. ఆవిడ చేత్తో నాటిన ఏ విత్తనమైన, మొక్క అయినా పువ్వులుపూసి కాయలు కాయవలసిందే. ఆఖరికి దొడ్లో గంధం చెట్టు కూడా పెంచింది. ఇల్లు కట్టిన కొత్తల్లో ఎక్కడో గంధం విత్తనాలు సంపాదించి చాలా కష్టపడి పెంచిందట ఆ చెట్టును.

ప్రత్యేకించి ఎటువంటి ఎరువులు వేసేదికాదు. దొడ్లో పెంటకుప్పదగ్గర వుండే మట్టినే వారానికి ఒకసారి ఎరువుగా వేసేది. ఎండిపోయిన పేడ ను వేసేది. సాయంత్రం నూతిలోంచి నీళ్ళు తోడి మమ్మల్ని తీసుకెళ్ళి మొక్కలకు పోసి రమ్మనేది.

## ఎందుకు?

**టీచర్:** టింకూ! స్వర్ణ దేవాలయం ఎక్కడ వుంది?

**టింకు:** మీకు తెలుసా టీచర్?

**టీచర్:** తెలుసు కానీ, నువ్వు చెప్పు.

**టింకు:** మీకు తెలిసిన విషయాన్నే మళ్ళీ నేను చెప్పడం బాగుండదు టీచర్.

"ఇదా! మీ ఇల్లు' అన్నాడు నిరాసక్తంగా.

వాడు అలా అనేసరికి వాస్తవంలోకి వచ్చాను. అసలే బాధగా వున్న మనసుని వాడి మాటలు ఇం కొంచెం బాధపెట్టాయి.

రంగుల కాంక్రీట్ ప్రపంచాన్ని చూస్తున్న వాడి కళ్ళకు పాతకాలంనాటి ఈఇల్లు ఎక్కడ ఆనుతుంది.

గతంలో ఈ ఇల్లు ఎంత కళకళలాడుతూ ఉండే ది. కనుచూపు మేర అంతా పచ్చదనమే. ఇల్లంతా సందడిసందడిగా ఆనందానికి నెలవుగా ఉండేది.

** ** **

వెయ్యి గజాల స్థలంలో వున్న ఇల్లు.

చుట్టూ స్థలం వదిలి మధ్యన మూడు వందల గజాల్లో కట్టిన దక్షిణం వీధి వున్న పెంకుటిల్లు.

చుట్టూ సిమెంట్ ప్రహరీ గోడ. సిమెంట్‌తో చేసిన ఆర్చి. దానికి చెక్క గేటు.

గేటు తీసుకొని లోపలకు వచ్చినవారికి స్వాగతం పలుకుతున్నట్లుగా ఉండే చిన్న పూలతోట, గేటుకు అటూ ఇటూ అశోక చెట్లు. గేటు తీసు కొని లోపలికి వచ్చినవారు తిరిగి గేటు వేయాలి. లేకపోతే అక్కడే మడి బట్టతో పక్కన నీళ్ళ చెంబు పెట్టుకొని, ఒత్తులు చేసుకుంటూ కూర్చొనే అత్తయ్య గట్టిగా అరిచేది. గేటు వేయకపోతే మేకలు వచ్చి పూలమొక్క లు తినేస్తాయని ఆవిడ భయం.

గేటుకు ఎదురుగా ఇంటి మెట్లు, మెట్ల పక్కన అరుగులు. ఇంటికి ఆనుకొని నాలుగు పక్కలా అరుగులు. ముందు, వెనుక సిమెంట్ అరు గులు. పక్కల్న మట్టితో కట్టిన అరుగులు.

గేటు దాటి ఇంటికి చేరడానికి మధ్యలో ఇరవై అడుగులుంటుంది. ఆరు మెట్లు ఎక్కితే వీధి చావిడి. చావిట్లోకి వున్న మూడు గుమ్మాలు. ఎదురుగా సింహద్వారం, దానికి పది అంగుళాల ఎత్తు వున్న గడప. అక్కల పిల్లలు ఆ గడప దాటినప్పుడే గారెలు వండి పంచిపెట్టేవారు.

సింహద్వారానికి కుడిపక్కన గాదె గది. దాంట్లో పాత బట్టల పెట్టె, బొమ్మలున్న పెద్ద చెక్కపెట్టె, మా పుస్తకాలు పెట్టుకొనే సందుగ పెట్టెలు వుండేవి. ఇంట్లో చాలా చెక్కపెట్టెలు వుండటంతో పిల్లలందరికీ పుస్తకా లు పెట్టుకోవడానికి తలో పెట్టె ఇచ్చేవారు.

"మైథిలీ, మీ అమ్మ ఈ గదిలోనే పుట్టింది" అంటూ గాదె గదిని చూపించాను.

ఎడమ పక్కన బోషాణం గది గుమ్మాలు. బోషాణం గదిని పురిటి గది, బొమ్మలగది అని కూడా అనేవారు. అక్కడే నేను, పెద్దక్క, చిన్నక్క పిల్లలు పుట్టాం. దాన్నే బొమ్మల గది అని కూడా అనేవాళ్ళు. సంక్రాంతి పండగ అయ్యాక ముక్కనుమనాడు బొమ్మలనోము పట్టేవారు. మా చిన్నతనంలో అగ్రహారంలోని పెళ్ళయిన స్త్రీలు బొమ్మలనోము పడితే నలుగురైదుగురు కలిసి ఒకచోట బొమ్మలుచేసి ఒకచోట పెట్టి పొద్దున్న, సాయంత్రం పూజలు చేసేవారు. రోజుకోరకం పిండివంట చేసి నైవేద్యం పెట్టేవారు. కాలువ నుంచి ఒండ్రుమట్టి తెచ్చి అత్తయ్య వాళ్ళందరికీ బొమ్మలు చేసి ఇచ్చేది. ఈవిధంగా తొమ్మిదేళ్ళు ఆ నోము చేసేవారు.

నిలువెత్తు టేకు సింహద్వారం. దానికి రెండు టేకు తలుపులు.

(తరువాయి 27వ పేజీలో)



# కలలసౌధం

(11వ పేజీ తరువాయి)

గుమ్మానికి అటు ఇటు రెండు పెద్దపెద్ద కిటికీలు.

సింహద్వారం తలుపులు తెరిచి వుంచితే దొడ్లో గుమ్మానికి ఎదురుగా ఉండే పనస చెట్టు కనిపిస్తుంది. అంటే సింహద్వారం ఎదురుగా భోజనాల గదిలోకి గుమ్మం, అక్కడ నుంచి దొడ్లోకి గుమ్మం వరసగా వుంటాయి. దాంతో గాలికి, వెలుతురుకు కొరత ఉండేది కాదు.

వేసవి కాలం మధ్యాహ్నం భోజనాలు అయ్యాక దొడ్డి తలుపులు తెరిచి గుమ్మంలో చాప వేసుకొని పడుకునేవారు నాన్న. మేం దొడ్లో చెట్లకింద చాపలు వేసుకొని పడుకునేవాళ్ళం. బాలరామాయణం, బాలభారతం లాంటి పుస్తకాలు చదువుకునేవాళ్ళం. ఆడుకునేవాళ్ళం. అప్పుడు అసలు వేసవి వేడి తెలిసేది కాదు పగలు రాత్రి కూడా. రాత్రిళ్ళు ఆరుబయట, మెట్లకు అటు, ఇటు వున్న అరుగుల మీద నులక మంచాలు, మడత మంచాలు వేసుకొని పడుకునేవాళ్ళం.

ఇంటికి కరెంట్ వుందికానీ, ఫ్యాన్లులేవు. నూతిలో నీళ్ళు అప్పటికప్పుడు తోడుకొని తాగితే ఎండవేళ అయినా చల్లగా వుండేవి.

సింహద్వారంలోంచి లోపలకు అడుగుపెడితే హాలు. గుమ్మానికి ఎదురుగా సీతా స్వయంవరం చిత్రపటం. దానివక్కనే పెద్దనాన్న ఫొటో. స్వాతంత్ర్య పోరాటంలో అలసిపోయి చిన్న వయసులోనే పటానికి దండ వేయించుకున్నారాయన. చుట్టూరా గోడలకు తగిల్చిన పూర్వీకుల ఫొటోలు, అమ్మానాన్న ఫొటో, చిన్నప్పటి మా ఫొటోలు, దేవుళ్ళ ఫొటోలు, గాంధీ, నెహ్రూ, లాల్‌బహదూర్‌శాస్త్రిల ఫొటోలు ఉండేవి.

సింహద్వారం గడప దగ్గర చిన్న మెట్టు వుండేది. అక్కడ కూర్చుని చదువుకోవడానికి దెబ్బలాడుకునేవాళ్ళం. ఎందుకంటే సింహద్వారం పైనే బల్బు వుండేది. వెలుతురు బాగా పడుతుందని అక్కడ కూర్చునేవాళ్ళం. చదువుకుంటూ నిద్రవచ్చినప్పుడు హాల్లో గోడలకి వున్న ఫొటోలను చూసేవాళ్ళం. వాటిని చూడటం మొదలుపెడితే నిద్దర వచ్చే కాదు. రోజూ చూస్తున్న ఫొటోలే అయినా విసుగు వచ్చేది కాదు.

హాల్లోకి మూడు గుమ్మాలు. ఎడమ పక్కన వున్న గది నాన్నది. దాంట్లోనే నాన్న పుస్తకాలున్న అద్దాల బీరువా, బట్టలు పెట్టుకునే టేకుతో చేసిన పెద్దపెద్ద చెక్క పెట్టెలు, నాన్న పడుకునే పెద్ద దుంపకోళ్ళ మంచం వుండేవి. నాన్న దగ్గర సంస్కృత నిఘంటువులు, పురాణగ్రంథాలు, సాహిత్య పుస్తకాలు చాలా ఉండేవి.

కుడి పక్కన బాబయ్య పడుకునే గది.

హాల్లో పిల్లలు, అత్తయ్య పడుకోవడానికి హాల్లోనూ, బోషాణం గదిలోనూ మంచాలుండేవి. హాల్లో పైన దూలానికి తాళ్ళతో వేళ్ళాడదీసిన ఉయ్యాల. అక్కల పిల్లలు పేచీలు పెట్టినప్పుడు హాల్లో పైన వేలాడుతున్న ఉయ్యా ల్లో 'బూచబ్బాయి' వున్నాడని భయపెట్టేవారు.

ఎదురుగా వున్న గుమ్మంలోంచి లోపలకు వెళితే పొడుగ్గా వున్న భోజనాల గది. దానికి కుడిపక్కన వంటగది. అక్కడ వర్షాకాలంలోనే వంట చేసేవారు. మిగిలిన రోజుల్లో దొడ్లో వున్న పొయ్యిమీదే వంట చేసేవాళ్ళు. మడివాళ్ళు వంటగదిలోనూ, పక్కనే వున్న భోజనాల గదిలో మాకు అన్నం పెట్టేవారు.

అక్కడ గోడకు కింద వరసలో రెండు మేకులు, పైన రెండు మేకులు కొట్టి వున్నాయి. వాటిని చూపిస్తూ మావాడికి- "పైన నిచ్చెన పెట్టుకునేవాళ్ళం. కింద మేకులపైన మేం అన్నంతినే కంచాలు పెట్టుకునేవాళ్ళం. పిల్లలు భోజనాలు చేసే కంచాలను మడివాళ్ళు ముట్టుకునేవారు కాదు. అందుకని విడిగా పెట్టుకునేవాళ్ళం. మా నాన్న, అత్తయ్య, అమ్మ, బాబయ్య, పిన్ని రోజూ అరటి ఆకుల్లోనే తినేవారు" అని చెప్పాను.

బాబయ్యకు పిల్లలు లేకపోవడంతో మా ఇంట్లోనే ఉండేవారు.

భోజనాల గదిలోనే రెండు అటకలు ఉన్నాయి. ఒకటి పెద్ద అటక, ఇంకొకటి చిన్న అటక. చిన్న అటక మీద ఊరగాయల జాడీలు ఉండేవి. అత్తయ్యకానీ, నాన్నకానీ మడిబట్టతో నిచ్చెన వేసుకొని ఎక్కి ఊరగాయలు చిన్న జాడీల్లోకి తీసేవారు. మమ్మల్ని ముట్టుకోనిచ్చేది కాదు.

పెద్ద అటకమీద ఇత్తడి గుండిగలు, పెద్దపెద్ద ఇత్తడి గిన్నెలు, బిందెలు, రాగి బిందెలు, ఇత్తడి చెంబులు, గ్లాసులు ఉండేవి. అటక నిండా ఇత్తడి సామానే ఉండేది. వాటిని పెళ్ళిళ్ళకు, పెద్దపెద్ద సంతర్పణలకు వాడేవారు. వినాయక చవితి, కార్తీకమాసంలో సంతర్పణలు జరిగేవి. ఒక్కొక్కసారి ఒక్కొక్కళ్ళ ఇంట్లో వంటలు చేసేవారు. పెద్ద వంటలు అగ్రహారంలో దాదాపు అందరి ఇళ్ళల్లోనూ గాడి పొయ్యిలు ఉండేవి.

వంటింట్లోంచి దొడ్లోకి గుమ్మం. దొడ్డిగుమ్మంలోంచి బయటకు వెళితే ఇంటి పొడుగునా వుండే పెద్ద గచ్చు అరుగు. అరుగు కట్టేటప్పుడు ఒక చివర చూరుకిందకు రుబ్బురోలును పాతించారు. దాంట్లో మా అత్తయ్య పచ్చళ్ళు రుబ్బేది. గారెలు, మినపరొట్టి పిండి రుబ్బేది. అప్పుడు ఇడ్లీలు చేసేవారు కాదు. అమ్మ రాత్రిళ్ళు అరుగుమీద కుంపటి పెట్టుకొని వంట చేసేది. రాత్రిళ్ళు పిల్లలందరం దొడ్లో తులసికోట దగ్గరకానీ, అరుగుమీద కానీ భోజనాలు చేసేవాళ్ళం. మెట్లు దిగి కిందకు వెళితే గుమ్మానికి ఎదురుగా వుండే పెద్ద తులసికోట. దాని చుట్టూ వారానికి ఒకసారి పేడతో అలికేది అత్తయ్య. దానికి రోజూ అమ్మ, అత్తయ్య పూజలు చేసేవారు.

దానికి కొంచెం దూరంలో వున్న ఇటుకలతో చేసిన అలుకుడు పొయ్యి.

ఇంటికి ఈశాన్యంలో బావి. వాయువ్యంలో పెంటకుప్ప. ఆగ్నేయంలో పాకీవాళ్ళు వచ్చి తుడిచే మరుగుదొడ్డి. నైరుతిలో సెప్టిక్ ట్యాంక్ వున్న మరుగుదొడ్డి.

ఇంటి చుట్టూ వుండే ఆరువందల గజాల స్థలంలో మూడు మామిడి చెట్లు. మామిడి కొమ్మకు చేంతాడుతో కట్టిన ఉయ్యాల. నాలుగు కొబ్బరి చెట్లు, చింతచెట్టు, కుంకుడు చెట్టు, నిమ్మచెట్టు, గోరింటాకు. ఇక అరటి చెట్ల సంగతి చెప్పనక్కర్లేదు. ఎప్పుడూ భోజనాల గదిలో దూలానికి ఒక అరటిపళ్ళ గెల వేళ్ళాడుతూ ఉండేది. ఎవరూ తినక పళ్ళు మిగిలి ముగ్గి కింద రాలిపోయేవి. వీధివెంపున దానిమ్మచెట్టు, నారిజం చెట్టు, అశోక చెట్లు, గేటుకు రెండుపక్కల వున్న మల్లె, చేమంతి, గులాబి చెట్లు, ఏ కాలంలోనూ పూసే పచ్చగుత్తుల చెట్టు. వర్షాకాలంలో అయితే చెట్టునిండా గుత్తుల గుత్తుల పూలతో ఆకర్షణీయంగా వుండేది.

శ్రావణమంగళవారం పేరంటానికి వచ్చిన వాళ్ళు అందరూ ఒక్కో గుత్తి కోసుకొని తలలో పెట్టుకునేవారు. వినాయక చవితి, దసరా నవరాత్రుల ప్పుడు అందరూ వచ్చి పూజకు పూలు కోసుకెళ్ళేవారు. గేటుపక్కనే వున్న విరజాజి తీగ. ఆర్చిపైకి ఎక్కించడంతో ఆర్చి అంతా గుబురుగా అల్లుకుంది. నిచ్చెన వేసుకొని, గోడ ఎక్కి విరజాజి మొగ్గలు కోస్తే పెద్ద గిన్నెడు వచ్చేవి. అక్కలందరూ పోటీలుపడి మాలలు కట్టేవారు.

ఆరుగురిలోనూ ఆఖరిదాన్ని అవడంతో నాకు ఇంట్లో పనిచేయడంకానీ, మాలలు కట్టడంకానీ అలవాటు కాలేదు. జడ వేసుకోవడం కూడా వచ్చేది కాదు. గడిచిన కాలమంతా ఒక కలగా మిగిలిపోయింది.

ఈ ఇల్లు ఒక జ్ఞాపకంలా నిలిచిపోయింది. అప్పుడప్పుడు వచ్చి చూసి వెళ్ళడమే తప్ప ఈ ఇంట్లో ఉండటం సాధ్యమా? ఇలాంటి ఇల్లు సిటీలో ఉంటుందా? సిటీ కాలుష్యంలో ఈపచ్చదనం పచ్చగానే వుంటుందా? ఇంటిని పిల్లలతో కలిసి కలియతిరుగుతుంటే మనసులో ఆలోచనల పరంపర.

"అమ్మా! బోర్‌కొడుతోంది. రాజమండ్రి వెళ్ళిపోదాం" అన్నాడు మావాడు.

"భోజనాలుచేసి వెళ్ళండి. వంట అయిపోయింది" అన్నారు పిన్నిగారు.

భోజనాలయ్యాక సాయంత్రం వరకు ఉండి రాజమండ్రి బయల్దేరాం.

బయటకు వచ్చి గేట్లో నిల్చొని మరోసారి ఇంటిని కళ్ళారా చూసుకున్నాను. అయిన వాళ్ళను వదిలిపెట్టి వెళుతున్నప్పటి దిగులు.

మళ్ళీ ఎప్పుడు చూస్తానో అన్న భావన మనసును కలచి వేసింది.

** ** **

నేను పుట్టి పెరిగిన ఇల్లు ఇప్పుడు నాకు ఒక జ్ఞాపకం. కలలసౌధం. ఒక మాన్యుమెంట్‌ను సందర్శించినట్టుగా మా ఇంటికి వెళ్ళిరావడం ఒక వైచిత్రిగానూ, ఒక విషాదంగానూ తోచింది. •

